క్లుప్తంగా

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి



వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వడ్డే సంఘం నాయకులు

నందవరం : స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న జయంతిని వడ్డె సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలోని నాగలదిన్నె గ్రామంలో ఆయన చిత్రపటానికి సంఘం నాయకులు శ్రీను, భీమన్న, నాగరాజులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ..స్వాతంత్ర్య పోరాటంలో ఆయన త్యాగం, ధైర్య సాహసాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజి, లింగన్న, నాగర్జున, జమ్మన్న పాల్గొన్నారు.



ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కౌతాళం: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి తహసీల్దారు రజనీకాంత్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి మిత్రుడిగా జీవితంలో ఎన్నో పోరాటలు చేసిన వీరుడిగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వాయుపుత్రుడికి పూజలు



కౌతాళం: మండలంలోని అంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలి వచ్చి పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారు జామున అర్చకులు స్వామికి సుప్రభాత సేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



రాస్తారోకో చేస్తున్న మాల మహానాడు నాయకులు

నందవరం : మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో దళితుడు కాసింపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని మాలమహానాడు నాయకులు మహానంది, సాయిరాం డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో మాల మహానాడు ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు రాస్తారోకో చేపట్టారు. వారు మాట్లాడుతూ.. మాల కాసింపై పొలం తగాదాలో దాడి చేసి నాలుగు రోజులైనా ఇంత వరకు కేసు నమోదు చేయకపోవడం విచారకరన్నారు. కాసింపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు ఎల్లప్ప, చంద్రోశేఖర్, భరత్, లింగన్న, గోరంట్ల తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

ఆదోని రూరల్: ఎన్నికల సమయంలో కేంద్రంలోని బీజేపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, రైతు సంఘం కార్యదర్శి తిమ్మయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యవసాయ ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. అధికారం వచ్చిన తర్వాత రైతులను విస్మరించారన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఆరు హామీలను ఇచ్చి ఇంతవరకు అమలు చేయలేదన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. అనంతరం ఏపీ రైతు సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా హనుమంతు, ప్రధాన కార్యదర్శిగా బసాపురం గోపాల్‌తో పాటు మరో 8 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

కుంభాభిషేకానికి ముస్తాబు

- ఉరుకుందలో ఫిబ్రవరి 1 నుంచి కుంభాభిషేకం నిర్వహించే అవకాశం
- ఉత్సవానికి సిద్ధమవుతున్న ఈరన్నస్వామి క్షేత్రం
- రంగులు దిద్దుకుంటున్న రాజగోపురాలు
- శరవేగంగా జరుగుతున్న పనులు



ఉత్తర ద్వారం రాజగోపురానికి పూరైన రంగులు

దేవాలయం వద్ద ప్రధాన ఆర్చిగేట్‌కు రంగులు వేస్తున్న దృశ్యం





పడమర ద్వారం రాజగోపురానికి రంగులు వేస్తున్న దృశ్యం



ప్రధాన తూర్పు ద్వారం రాజగోపురానికి పూరైన రంగులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి క్షేత్రం వద్ద రాజగోపురాల నిర్మాణం పూర్తి కావడంతో కుంభాభిషేకం కార్యక్రమం ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించే అవకాశం ఉంది. దీంతో క్షేత్ర పరిధిలో వివిధ అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. రాజగోపురాలకు రంగుల వేసే పనులు చురుకుగా జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రధాన ద్వారం తూర్పు ద్వారం రాజగోపురానికి, ఉత్తర ద్వారం రాజగోపురానికి రంగులు పూర్తయ్యాయి. పడమర ద్వారం రాజగోపురానికి రంగుల పనులు జరుగుతున్నాయి. కుంభాభిషేకాకంతా పూర్తి చేయాలనే లక్ష్యంతో ముమ్మరంగా పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా రాజగోపురాలకు కలశాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీనితో పాటు ఆలయం ముఖద్వారంలో ఉన్న ఆర్చిగేటుకు, కౌతాళం వద్ద, ఎరిగేరి వద్ద , కుప్పగల్ వద్ద, కోసిగి వద్ద ఉన్న ఆర్చిగేట్‌లతో పాటు హాల్వి వద్ద ఉన్న ఆర్చికి కూడా రంగులు వేస్తున్నారు. వీటితో పాటు ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటు, గణపతి మంతంతో పాటు గణపతి విగ్రహ ప్రతిష్ట, లక్ష్మీదేవి మంతంతో పాటు విగ్రహ ప్రతిష్ట, నవగ్రహాల ప్రతిష్ట చేయనున్నారు. యాగశాల నిర్మాణం, గజవాహన, శేషవాహనం, నందివాహనాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు మరిన్ని అభివృద్ధి పనులను చురుకుగా చేపడుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

ఆదోని టౌన్: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని పార్టీ మండల అధ్యక్షుడిగి నియమితులైన ఆర్.గురునాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనపై నమ్మకం ఉంచి రెండోసారి ఆదోని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా ఎంపిక చేశారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవలందిస్తానన్నారు. అందరి సమన్వయంతో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఎమ్మిగనూరుటౌన్: మంత్రాలయం మండలం తుంగభద్ర రైల్వే స్టేషన్ సమీపంలో సిమెంట్ సిమ్మెకు ఉరివేసుకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం శనివారం స్థానిక స్వచ్ఛంద సంస్థ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. మానవ హక్కుల సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కామలే గణేష్, పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు నరసన్నల ఆధ్వర్యంలో పట్టణంలోని శ్మశాన వాటికలో అంతిమ సంస్కారాలు చేశారు. కార్యక్రమంలో ప్రతిభ భారతి జిల్లా అధ్యక్షులు ప్రసాద్, మహానంది, అబ్రహం, మంత్రాలయం, మాధవరం పోలీసులు పోలీసులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యున్నతే లక్ష్యం



మాట్లాడుతున్న కొత్తగా ఎంపికైన వైఎస్సార్‌సీపీ మండలాల అధ్యక్షులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంతో పాటు గోనెగండ్ల, నందవరం మండలాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యున్నతికి తమ వంతుగా కృషి చేస్తామని కొత్తగా నియమింపబడిన ఆయా మండలాల, పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేషప్ప, కేవీ.కృష్ణారెడ్డి, శివప్ప గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమను నమ్మి పార్టీ కోసం పట్టణ, మండల అధ్యక్షులుగా నియమించిన పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో తీసుకెళ్తామని చెప్పారు. పట్టణంలో, తమ మండలాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని ఐక్యతతో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్ సీపీ చేనేత విభాగ జిల్లా అధ్యక్షుడు ఎంకే శివప్రసాద్, ఎల్లెల్సీ మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి, సోమేష్, చంద్రోశేఖర్, కౌన్సిలర్ నీలకంఠ, కడిమెట్ల నాగార్జున రెడ్డి, పామయ్య, నరసింహులు, పామయ్య, లతా రెడ్డి, గోకారమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేవీ కృష్ణారెడ్డికి సన్మానం

గోనెగండ్ల : వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా వేముగోడు కేవీ కృష్ణారెడ్డి ఎంపిక పట్ల మండల వైఎస్సార్ సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మండల పరిధిలోని వేముగోడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నరేష్ రెడ్డి, రవి రెడ్డి, ఉరుకుందరెడ్డి, మహిళలు కృష్ణారెడ్డిని పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అలాగే కేక్ కట్ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగన్న, సురేష్, శేఖర్, బాలరాజు, లక్ష్మన్న, శ్రీను, గిడ్డయ్య, హనుమంతు, రాజారెడ్డి పాల్గొన్నారు.

వాస్తవాలు మాట్లాడండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాళ్లు

ఆదోని టౌన్: నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు వాస్తవాలను మాట్లాడాలని, అబద్ధాలతో ప్రజలను ఎన్ని రోజులు మభ్యపెడతారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి శ్రీలక్ష్మి, మైనార్టీ జిల్లా విభాగం ఉపాధ్యక్షురాలు జిలేకాబీ, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పోలకల్ రేణుక, సభ్యులు సుగుణమ్మ అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. హిందూ సంప్రదాయాలను పాటించడంలో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి ఎవరూ సాటి రారన్నారు. ఆయనకే హిందూ సంప్రదాయాల గురించి ముస్లిం మైనార్టీ నాయకులు ఉమ్మి సలీం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సాయిప్రసాద్ రెడ్డిని విమర్శించే స్థాయి ఉమ్మి సలీంకు లేదన్నారు. ఆయన మాటలను సలీం వక్రీకరిస్తున్నారన్నారు. హిందూ సంప్రదాయాలంటే సాయికి ఎంతో మక్కువని చెప్పారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఆదోని నియోజకవర్గంలోని ఏ గ్రామమైనా, వీధి అయినా, వార్డుల్లో అయినా మాజీ ఎమ్మెల్యే సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. అందరూ బాగుండాలి, అందులో మనముండాలన్నది సాయిప్రసాద్‌రెడ్డి కోరిక అని చెప్పారు.

శబరిమలైకు అయ్యప్ప భక్తులు

కోసిగి: మండల కేంద్రం కోసిగికు చెందిన అయ్యప్ప స్వామి భక్తులు ఇరుముడితో కేరళ రాష్ట్రంలో వెలసిన అయ్యప్ప స్వామి దర్శనార్థమై బయలు దేరారు. స్థానిక బీరప్ప స్వామి ఆలయంలో గురుస్వామి చంద్రశేఖర్ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తాదులతో ఇరుముడి కట్టించారు. ముందుగా అయ్యప్ప స్వామికి పడిపూజ, మెట్ల పూజ, మహా మంగళ హారుతులు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు.

కార్మిక హక్కుల కోసం పోరాడాలి

ఆదోని రూరల్: కార్మికుల హక్కుల కోసం పోరాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. అంజిబాబు, జిల్లా నాయకులు రామాంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నాయన్నారు. కార్మికులకు కనీస వేతనం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్కీం వర్కర్లు, అంగన్‌వాడీ, ఆశావర్కర్ల వేతనాలు కూడా పెంచకుండా వేధిస్తున్నారన్నారు. అసంఘటిత రంగమైన ఆటో, భవన నిర్మాణం కార్మికులు, హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నెలకు రూ.28 వేలు చొప్పున వేతనం అందించాలన్నారు. కార్మికులందరూ ప్రభుత్వాలపై తిరుగుబాటుకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, శంకర్, రంగ, వీరన్న, వరలక్ష్మి, సోమక్క, పుష్ప, పద్మ, నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి రీసర్వే ప్రారంభం



మాట్లాడుతున్న తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి

కౌతాళం: మండలంలో ఈనెల 20 నుంచి భూముల రీసర్వే ప్రారంభిస్తున్నట్లు తహసీల్దారు రజనీకాంత్ రెడ్డి తెలిపారు. శనివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల సర్వేయర్ బసవరాజుతో కలిసి ఆయన మాట్లాడుతూ మండలంలో 35 రెవెన్యూ గ్రామాలకు గాను గతంలోనే 17 గ్రామాలకు రీసర్వే అయ్యిందని, మిగితా 18 గ్రామాల్లో రీసర్వేను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ రీసర్వేను మండలంలో ఈనెల 20 నుంచి ప్రారంభిస్తున్నమని, పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని గుడికంబాలి గ్రామాన్ని ఎన్నుకొని సర్వే చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి రోజు 20ఎకరాలు మాత్రమే సర్వే చేస్తామని, ఒక టీంకు 200 ఎకరాల నుంచి 250 ఎకరాలకు మాత్రమే సర్వే చేసే విధంగా ప్లాన్ చేశామన్నారు. సర్వే కోసం కమ్యూనికేషన్ టీం రైతులకు నోటీసులకు పంపిస్తుందని, నోటిసులు ఇచ్చిన తర్వాతనే సర్వేను పూర్తి చేస్తామన్నారు. రైతులు సహకారం అందించాలని కోరారు. రీసర్వేకు సంబంధించి శనివారం గుడికంబాలి గ్రామంలో ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో వీఆర్‌ఓలు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1995–2000 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సిద్ధప్ప, ఫయాజుద్దీన్, నరసయ్య, హనుమంతు, విజయకుమారిలతో పాటు పలువురిని సన్మానించారు. 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు బసవరాజు, ఈరన్న, గౌతమ్, భగవాన్ సింగ్, గౌరి, జయలక్ష్మి, కన్యాకుమారి తమ తోటి మిత్రులతో కలసి పాఠశాలను కలయ తిరుగుతూ తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరి యోగ క్షేమాలను ఒకరు అడిగి తెలుసుకున్నారు. చదువును ముగించుకొని వృత్తి రీత్యా, ఉద్యోగరీత్యా అయా ప్రాంతాల్లో స్థిరపడినప్పటికి అందరిని ఒకచోట చేరి ఇలా కలుసుకోవడం సంతోషంగా ఉందని పలువురు పేర్కొన్నారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ఆస్పరి: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆస్పరిలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఆస్పరి యూత్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించున్నట్లు నిర్వాహకులు రామకృష్ణ, మహేష్, అరవింద్ శనివారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ. 20,116, రూ.10,116, రూ. 5,116 ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎంట్రీ ఫీజు రూ.500 ఈనెల 13వ తేదీ చెల్లించాలని, వివరాలకు సెల్ 9912951780,9010788451 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సంక్రాంతి సంబరాలు

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో శనివారం ప్రారంభమైన సంక్రాంతి సంబరాల్లో గ్రామాన్ని దత్తత తీసుకున్న ఐపీఎస్ అధికారి, ఐజీ ఆకె రవికృష్ణ దంపతులు పాల్గొన్నారు. ముందుగా గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. ఐజీ మాట్లాడుతూ గ్రామంలో ఏటా జరిగే సంక్రాంతి సంబరాల్లో తాను కుటుంబ సమేతంగా పాల్గొంటున్నట్లు చెప్పారు. అందరూ కలిసిమెలిసి ఐక్యంగా జీవించాలని సూచించారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం కబడ్డీ, ఖోఖో, ముగ్గుల పోటీలను ప్రారంభించారు.

క్రీడా మైదానంలో మురుగు నీరు



పాఠశాల ఆవరణలో డ్రైనేజీ నీరు

గోనెగండ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోకి మురుగునీరు వచ్చి చేరుతుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. నీరు నిల్వ వుండటంతో విద్యార్థులు క్రీడలు ఆడేందుకు ఆటంకంగా ఉంటోంది. పాఠశాలకు అనుకొని పెద్ద డ్రైనేజీ కాలువ ఉంది. అయితే అది చెత్త చెదారంతో నిండి పోవడంతో గత మూడు రోజులుగా ప్రహరీ కింద నుంచి క్రీడా మైదానంలోకి మురుగునీరు చేరుతోంది. క్రీడా మైదానంలో విద్యార్థులతో పాటు యువతి, యువకులు, వృద్ధులు, మహిళలు ఉదయం, సాయంత్రం వేళాల్లో వ్యాయమం కోసం నిత్యం వస్తుంటారు. మురుగు వల్ల వారికి కూడా ఇబ్బందులు తప్పడంలేదు. అధికారులు స్పందించి మైదానంలోని డ్రైనేజీ నీరు తొలగించి, కాలువను శుభ్రం చేసి నీరు మళ్లీ రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు గానిగ బాష, మాలిక్, ఖాసీం సాహెబ్ కోరుతున్నారు.



పల్లెపాడు గ్రామ వద్ద ప్రమాదకరంగా మలుపు

ప్రమాదకర మలుపు

కోసిగి: కోసిగి మండలంలో పలు గ్రామాలకు వెళ్లే మలుపులు చాల ప్రమాదకరంగా తయారయ్యాయి. కోసిగి నుంచి కౌతాళం మండలం ఉరుకుంద గ్రామానికి 10 కిలో మీటర్లు దూరం ఉండగా.. 21 మలుపులు ఉన్నాయి. కోసిగి నుంచి మాలపల్లి వరకు 12 మలుపులు ఉన్నాయి. ఎమ్మిగనూరు నుంచి కోసిగి మీదుగా ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనార్థం భక్తులు అత్యధికంగా ఈ రహదారిలోనే తరలి వెళ్తున్నారు. మలుపులు వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు, సూచికలు లేక పోవడంతో అతివేగంగా వచ్చి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

సింగిల్ రోడ్డు ఉండడంతో రాత్రిల్లో వాహనాలు బోల్తాపడి మృతి చెందిన సంఘటలూ ఉన్నాయి. ప్రమాదాలు నివారించేందుకు మలుపులు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు.



అంబాభవానీ ఆలయ ఆవరణలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

ముగ్గుల పోటీలు

ఆదోని అర్బన్: పట్టణంలోని కిలిచినపేటలో వెలిసిన శ్రీ అంబాభవానీ దేవాలయంలో సంక్రాంతి పండగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. మహిళలు ఆలయ ఆవరణలో రంగులతో ముగ్గులు వేసి అబ్బురపరిచారు. ఆలయకమిటీ సభ్యులు జిందే శంకర్, ఆదిశేషు, శంకర్, రఘునాథ్, బొందే లక్ష్మన్న, నాగరాజ్, వినోద్ పాల్గొన్నారు.



పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రంగు,రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం



పూర్వ విద్యార్థుల సమ్మేళనానికై సిద్ధమైన ప్రాంగణం

నేడు పాఠశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు



మొబైల్ టాయిలెట్ల వాహనం ఏర్పాటు చేసిన దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణలో ఆదివారం ప్లాటినం జూబ్లీ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శనివారం కమిటీ సభ్యులు హరినాథ్‌రెడ్డి, ఎంసీ శివకుమార్, బైలుప్పల షఫీవుల్లా, మాచాని వెంకటేష్, మల్లికార్జున, నట్‌రాజ్‌రెడ్డి, కామలే గణేష్ తదితరులు తెలిపారు. పాఠశాల, కళాశాల ఆవరణలో 75 వసంతాల వేడుకకు హాజరయ్యే పూర్వ విద్యార్థుల మహా సమ్మేళన నిర్వహణకు షామియానాలు, కుర్చీలను ఏర్పాటు చేశామన్నారు. భవనాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించినట్లు తెలిపారు. వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లతో పాటు దాదాపు 2వేల మందికి పైగా హాజరుకానున్న పూర్వ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. మొబైల్ టాయిలెట్‌లను సిద్ధంగా ఉంచామన్నారు. ఈ మహాసమ్మేళనానికి వచ్చే గురువులకు సన్మానం , వారితో పాటు పూర్వ విద్యార్థుల నాటి మధుర జ్ఞాపకాలను పంచుకునేలా ఉపన్యాసాలు, ఇదే పాఠశాలలో చదివి ఉన్నత స్థానంలో వున్న ప్రముఖులు, ప్రజా ప్రతినిధుల ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ వేడుకలు మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోయేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఐక్యతతో అందరికి ఆదర్శంగా నిలిచేలా పనిచేసి వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.